క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొరిటిపాడు(గుంటూరు): 11 కేవీ పట్టాభిపురం ఫీడర్‌లో చెట్ల కొమ్మలు తొలగించడం, లైన్ మెయింటెనెన్స్ ఉన్నందున పట్టాభిపురం తదితర ఏరియాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు టౌన్–2 డీఈఈ ఎస్.గురవయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సుబ్రమణ్యంకు లయన్స్ ఇంటర్నేషనల్ ప్రశంసా పత్రం



తెనాలిఅర్బన్: లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ వ్యవస్థాపకుడు లయన్ కాకరపర్తి సుబ్రమణ్యంకు అమెరికాలోని లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వారు ఆన్‌లైన్‌లో ప్రశంసా పత్రాన్ని పంపారు. బుధవారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ నిర్వహించిన సర్వేలో ఆయన పాల్గొని సలహాలు, సూచనలు ఇచ్చారు. దీనిపై స్పందించిన క్లబ్ చైర్‌పర్సన్ డాక్టర్ పట్టిహిల్ ప్రశంసా పత్రాన్ని పంపినట్లు చెప్పారు.

కల్యాణం..కమనీయం



మంగళగిరి: మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని నగరంలోని ఆలయాల్లో శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. నవులూరు గోలివారితోట, కాజ అగస్త్యేశ్వర స్వామి ఆలయం, యర్రబాలెం శివాలయం పాత మంగళగిరి కనకదుర్గ ఆలయాల్లో కల్యాణ మహోత్సవం కనుల పండువగా సాగింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యి.. తిలకించారు. స్వామి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయాల వద్ద కమిటీల సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కార్మికులకు న్యాయం చేయండి



తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ గురువారం సందర్శించి, కార్మికులకు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలాది కోట్ల రూపాయలు విలువ చేసే సిమెంట్ ఫ్యాక్టరీ భూములు ఉన్నా కార్మికులకు బకాయిలు మాత్రం యాజమాన్యం చెల్లించకపోవడం దారుణమని అన్నారు. ఇప్పటికైనా మంత్రి నారాలోకేష్ ఎన్నికల ముందుకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. యహోషువా, మాణిక్యరావు, బాష, అగ్గయ్య, దానయ్య, శివకుమారి, సారమ్మ, రిబ్కా పాల్గొన్నారు.

విద్యార్థులతో పనులపై అధికారుల స్పందన

సాక్షి ఎఫెక్ట్

మంగళగిరి: సాక్షి దినపత్రికలో బుధవారం ప్రచురితమైన విద్యార్థులా.. లేక కూలీలా శీర్షిక కథనానికి అధికారులు స్పందించారు. విద్యాశాఖ మంత్రి నారా నియోజకవర్గంలో విద్యార్థులతో పనులు చేయించడంపై జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక, తెనాలి ఉప విద్యాశాఖాధికారి గురువారం ప్రధానోపాధ్యాయులు ద్వారా నివేదిక తెప్పించుకున్నారు. నివేదిక ప్రకారం పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా గదుల్లో కుర్చీలు సిబ్బంది ద్వారా సర్దించడం జరిగిందని, వారికి సహాయంగా కొందరు విద్యార్థులు కుర్చీలు, బెంచీలు పట్టడం జరిగిందన్నారు.

సోమేశ్వరస్వామి ఆలయంలో భారీ అన్నదానం

తాడేపల్లిరూరల్: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా తాడేపల్లి సీతానగరం సోమేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం భారీ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ ఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు విచ్చేసి, ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల్లో కన్నా అన్నదానం మిన్న అన్నారు. మహా శివరాత్రి సందర్భంగా అన్నదానం నిర్వహిస్తున్న అంబటి తిరుపతిరావు, అంబటి వెంకటేశ్వరరావు, అంబటి రఘురాముడును అభినందించారు. సుమారు వెయ్యి మంది భక్తులు అన్న ప్రసాదాలను స్వీకరించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మునగపాటి మారుతీరావు, నాయకులు సామల నాగేశ్వరరావు, బడే కోమలి, శివనాగేంద్రం, సిద్దే రఘుబాబు, మల్లి, టంకసాల ఈశ్వర్ నాయుడు, వల్లూరు శివ పాల్గొన్నారు.

ఓటెత్తిన పట్టభద్రులు

- పశ్చిమ నియోజకవర్గంలో భారీగా ఓటుహక్కు వినియోగం
- పోలింగ్ కేంద్రాల సమీపంలో ఓటరు హెల్ప్ డెస్క్‌ల పేరుతో కూటమి అభ్యర్థి ప్రచార పర్వం
- అత్యధికంగా పశ్చిమ నియోజకవర్గంలో 25,937 మంది ఓటర్లు



గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

గుంటూరు ఎడ్యుకేషన్: శాసనమండలి కృష్ణా–గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల సందర్భంగా పశ్చిమ నియోజకవర్గంలో పలు సంఘటనలు చోటు చేసుకున్నాయి. నియోజకవర్గంలో అత్యధికంగా 25,937 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారు. వీరంతా 10 కేంద్రాల పరిధిలో ఏర్పాటు చేసిన 42 పోలింగ్ బూత్‌లలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు ఉదయం 8 గంటలకు కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఇదే బూత్‌లో ఓటు వేశారు.



కుటుంబసభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న లక్ష్మణరావు



మాజేటి గురవయ్య కాలేజీ పోలింగ్ కేంద్రం వద్ద కూటమి అభ్యర్థి ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్

బరి తెగించిన కూటమి నేతలు

గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్, లక్ష్మీపురంలోని పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్, లాడ్జి సెంటర్‌లోని ఏఎల్ బీఈడీ కళాశాలల వద్ద కూటమి అభ్యర్థులు హెల్ప్‌డెస్క్‌ల పేరుతో ఎన్నికల ప్రచారం చేశారు. దీనిపై పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుతోపాటు పోటీలో ఉన్న పలువురు స్వతంత్ర అభ్యర్థులు అభ్యంతరం చెప్పడంతోపాటు జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేశారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరిగింది. ఉమ్మడి కృష్ణా–గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గస్థాయిలో మొత్తం పోలింగ్ 69.57 శాతంగా నమోదు కాగా, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పోలింగ్ శాతం తెలియాల్సి ఉంది. నియోజకవర్గ పరిధిలోని పలువురు ప్రముఖులు ఆయా పోలింగ్ బూత్‌లలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాగా గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు ముందుకు రాని విద్యావంతులు గ్రాడ్యుయేట్ ఎన్నికల్లోనూ అదే పంథా కొనసాగించారు. పోలింగ్ బూత్‌ల పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టినప్పటికీ టీడీపీ నాయకులు కూటమి అభ్యర్థికి అనుకూలంగా హడావుడి చేశారు.

ఓటేసిన కమిషనర్ దంపతులు



కమిషనర్ పులి శ్రీనివాసులు దంపతులు

లక్ష్మీపురం: కృష్ణా – గుంటూరు జిల్లా పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. గుంటూరులోని స్టాల్ గరల్స్ హైస్కూల్‌లోని బూత్ నంబర్ 213లో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు దంపతులు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

సూపర్ సిక్స్‌ను పక్కదారి పట్టిస్తున్న ప్రభుత్వం

- పోసాని మురళీకృష్ణ అరెస్ట్ అక్రమం
- వైఎస్సార్ సీపీ మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి



తాడేపల్లిరూరల్: ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వంలోని పార్టీలన్నీ ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చాయని, సూపర్ సిక్స్‌ను అమలు చేస్తామని చెప్పి గద్దెనెక్కిన తర్వాత విస్మరించాయని వైఎస్సార్ సీపీ మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి విమర్శించారు. గురువారం రాత్రి తాడేపల్లిలోని తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. హామీలను మరచి, ప్రజలు ప్రశ్నిస్తారనే భయంతో ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ నాయకులను కూటమి ప్రభుత్వం అక్రమ అరెస్టులు చేసి, భయభ్రాంతులకు గురిచేస్తోందని మండిపడ్డారు. విలేకరులతో మాట్లాడుతూ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు 40 ఏళ్ల అనుభవం ఉందని పదేపదే మాట్లాడారని, ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి ఎన్నికల అనంతరం వాటిని తుంగలో తొక్కారన్నారు. ప్రజల దృష్టిని మరల్చేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులకు టార్గెట్ చేసి రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది నెలల కాలంలో వేలాది మందిపై కేసులు నమోదు చేశారని ఆరోపించారు. దానిలో భాగంగా సినీ నటుడు పోసాని కృష్ణమురళిపై అక్రమ కేసు బనాయించి, హైదరాబాద్ నుంచి రాత్రికి రాత్రి రాయలసీమ తరలించారన్నారు. పోసాని రచయిత, అభ్యుదయ భావాలు కలిగిన వ్యక్తి అని, అతను ఎక్కడా కూటమి ప్రభుత్వాన్ని దూషించలేదన్నారు. ప్రభుత్వం చేస్తున్న పరిపాలనపై మాట్లాడారని, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చెప్పిన విధంగా ఆయా ప్రాంతాల్లో అధికారులు నడుచుకుంటున్నారని, ఏది మంచి ఏది చెడు అని కూడా ఆలోచించకుండా అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎన్నికల ముందు 30 వేల మంది ఆడపడుచులు కనిపించడం లేదంటూ పదేపదే ఆరోపణలు చేశారని, అందులో ఎంతమందిని తీసుకువచ్చారో ప్రజలకు చెప్పాల్సిన అవసరం వారిపై ఉందన్నారు. గుడ్లవల్లేరు కాలేజీ వంటి ఘటనలు అనేక చోట్ల జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉందని విమర్శించారు. ప్రజలు ప్రభుత్వ తీరును పరిశీలిస్తున్నారని, ఏదో రోజు ప్రజలు ప్రభుత్వంపై తిరగబడతారని ఆయన హెచ్చరించారు.

కష్టించి పనిచేస్తే సముచిత స్థానం

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు



పొనుగుపాడు ఎస్సీ కాలనీలో మాట్లాడుతున్న సమన్వయకర్త బాల వజ్రబాబు

ఫిరంగిపురం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కష్టించి పనిచేసిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం ఉంటుందని తాడికొండ నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు అన్నారు. మండలంలోని పొనుగుపాడు, గుండాలపాడు గ్రామాల్లో గురువారం సాయంత్రం నాయకులు, కార్యకర్తలతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఏర్పాటు చేసిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి గ్రామంలో పేదలకు ప్రభుత్వం పథకాలు అందేవన్నారు. నేడు కూటమి ప్రభుత్వం ఆ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. అనంతరం గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి తనవంతుగా సహాయ సహకారాలు అందిస్తానని నాయకులు, కార్యకర్తలకు హామీ ఇచ్చారు. నేనున్నాంటూ వారికి భరోసా కల్పించారు. సమష్టిగా అందరూ కలసికట్టుగా ముందుకు సాగుదాం అంటూ వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, పార్టీ మండలాధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హబీబుల్లా, చిట్టా అంజిరెడ్డి, కొమ్మారెడ్డి చిన్నప్పరెడ్డి, బద్దూరి శ్రీనివాసరెడ్డి, గేరా కోటేశ్వరరావు, మేలం జోజిబాబు, సర్పంచ్ పి.మధుసూదనరావు, పెరికల చిన్నా, చేవూరి రామమోహన్‌రెడ్డి, ఎస్.నాగరాజు, ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మయ్య, రాజేష్, బాజీ బాబు, కృష్ణమోహన్, సాగర్, దాసులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతకు నివాళి



గుంటూరు రూరల్: మండలంలోని తోకవారిపాలెంలో బుధవారం అనుమానాస్పదస్థితిలో వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కోపూరి శ్రీనివాసరావు మృతి చెందిన సంగతి తెలిసిందే. విషయం తెలుసుకున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ బలసాని కిరణ్‌కుమార్ గురువారం శ్రీనివాసరావు భౌతికకాయాన్ని సందర్శించారు. పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అన్ని విధాలా వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో గుంటూరు రూరల్ మండలం, తోకవారిపాలెం గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముమ్మరంగా శనగ, జొన్న కోతలు

ఇతర గ్రామాల కూలీలకు ఉపాధి

తాడికొండ: వ్యవసాయ పనులు తుది దశకు చేరాయి. మండలంలో శనగ, జొన్న పంట కోతలు జోరుగా కొనసాగుతున్నాయి. వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు ఈ ఏడాది త్వరగా కోతకు రావడంతో.. రైతులు పంట ఉత్పత్తులను ఇంటికి తెచ్చుకునే పనిలో నిమగ్నమయ్యారు. రాజధాని ప్రాంతం పూలింగ్ గ్రామాలతో పాటు ఈమని, వల్లభాపురం, గుంటూరు రూరల్ మండలాల నుంచి భారీగా వలస కూలీలు పనుల కోసం వస్తుండటంతో నిండుగా ఉపాధి లభిస్తోంది. ఎకరా శనగ కోతకు రూ.3వేలు, యంత్రం సాయంతో కల్లం చేసేందుకు రూ.4 వేలు కూలి ఇస్తుండటంతో కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జొన్న పంట బాండ్‌పై రైతులు సాగు చేస్తుండగా.. ఈ ఏడాది దిగుబడి పెరగడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శనగ పంటకు మాత్రం సరైన మద్దతు ధర లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విత్తనాలను క్వింటా రూ.7,300 వరకు కొనుగోలు చేసిన రైతులు...పంట విక్రయించబోతే.. క్వింటా రూ.5,500 మాత్రమే కొనుగోలు చేస్తామని వ్యాపారులు చెబుతుండటంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి శనగ కొనుగోలు కేంద్రాలను తెరిచి, మద్దతు ధరకు పంటను కొనుగోలు చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.



యంత్రం సాయంతో శనగ కల్లం చేస్తున్న స్తున్న కూలీలు



శనగ కోతలో కూలీలు

నందివాహనంపై మల్లేశ్వరుడు

మంగళగిరి టౌన్: మంగళగిరిలోని గంగా భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలల్లో భాగంగా స్వామి కల్యాణ మహోత్సవం అనంతరం గురువారం ఉదయం స్వామివారు నందివాహనంపై భక్తులకు దర్శనభాగ్యం కల్గించారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థాన ఈఓ జీవీ నారాయణ ఉత్సవ నిర్వహణను పర్యవేక్షించారు. గ్రామోత్సంలో గంగా భ్రమరాంబ సమేతుడైన మల్లేశ్వరుడు పురవీధుల్లో విహరించారు.

నేడు భారీ అన్న సంతర్పణ



తాడేపల్లిరూరల్ : తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లి పోలకంపాడులో వేంచేసియున్న పోలకమ్మతల్లి దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ అన్న సంతర్పణ నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు వంగ దేవ గురువారం తెలిపారు. పోలకంపాడులోని పోలకమ్మ తల్లిదేవాలయ 17వ వార్షికోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం నుంచి 11 గంటల వరకు అమ్మవారికి విశిష్ట పూజలు నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని ఆమె కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనంత ప్రభాకర్, తోక సత్యనారాయణ, గంగాధర్, కొండలరావు, బత్తుల నాగబాబు, బత్తుల ప్రభుదాసు, వంగ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం తక్షణమే జాబ్ కేలండర్ ప్రకటించాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్ యాదవ్

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వశాఖల్లో ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా తక్షణమే జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని కృష్ణా–గుంటూరు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి గుమ్మా శ్రీనివాస్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పొన్నూరు రోడ్డులోని తన కార్యాలయంలో గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతి ప్రకటించి, ప్రభుత్వ ఉద్యోగాలకు వయోపరిమితి పెంచాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న 16 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో పారదర్శకత చూపించాలని విజ్ఞప్తి చేశారు. ఏపీపీఎస్సీని ప్రక్షాళన చేసి, నిరుద్యోగుల ఆశలు వమ్ము కానీయకుండా చర్యలు చేపట్టాలని కోరారు. నిరుద్యోగుల జీవితాలను బాగు చేయాలనే ఆలోచనతో ప్రభుత్వం పని చేయాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్పష్టమైన ఆలోచన, ప్రణాళికతో 11 అంశాలను మేనిఫెస్టోలో చేర్చానని చెప్పారు. గురువారం జరిగిన ఎన్నికల్లో తనకు ఓటు వేసిన గ్రాడ్యుయేట్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అభియోగాలు లేకుండా ఉద్యోగ విరమణ అదృష్టం

సెంట్రల్ ట్యాక్స్, కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి



ఆషా, నాగశంకర్ దంపతులను సత్కరిస్తున్న నరసింహారెడ్డి తదితరులు

లక్ష్మీపురం: ప్రభుత్వ ఉద్యోగులు తప్పులు, అభియోగాలు లేకుండా ఉద్యోగ విరమణ చేయడం అదృష్టంగా భావించాలని సెంట్రల్ ట్యాక్స్, కస్టమ్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి అన్నారు. కన్నవారితోటలోని జీఎస్టీ భవన్‌లో సూపరింటెండెంట్ పోగుల ఆషా ఉద్యోగ విరమణ సభ గురువారం నిర్వహించారు. కమిషనర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ విధి నిర్వహణలో తెలిసో తెలియక చేసిన తప్పులు వల్ల పలు శాఖల్లోని ఉద్యోగులు విజిలెన్స్ కేసులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అవి పరిష్కారం అయ్యేసరికి పదవీ కాలం కూడా ముగుస్తుందన్నారు. కొన్ని కేసులు రిటైర్మెంట్ తర్వాత కూడా వేధిస్తాయని, పెన్షన్ లో కూడా ఇబ్బందులు తలెత్తుతాయని వివరించారు. ఉద్యోగులందరూ విధినిర్వహణలో ఎలాంటి అభియోగాలు, అభ్యంతరాలు, ఆరోపణలు, లోపాలు లేకుండా పనిచేయాలని సూచించారు. పదవీ విరమణ చేస్తున్న ఆషా తన సర్వీసులో ఎటువంటి మచ్చ లేకుండా, పారదర్శకంగా, సమర్థవంతంగా పనిచేశారని కమిషనర్ కొనియాడారు. అడిషనల్ కమిషనర్ బి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఆషా ఎన్నోసార్లు రక్తదానం చేశారని, అవయవ దానం చేయడానికి కూడా ముందుకు రావడం అభినందనీయమన్నారు. అనంతరం ఆషా, నాగశంకర్ దంపతులను కమిషనర్ సాధు నరసింహారెడ్డి ఆయన సతీమణి, కేంద్ర ప్రభుత్వ శాఖ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు సాధు కావ్య, ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్లు వి.వి.రావు, నాగరాజు, రవికుమార్, మనోజ్ కుమార్, రాయలు, సీతారామరాజు సూపరింటెండెంట్లు గాదె శ్రీనివాసరెడ్డి, చీదెళ్ల ఈశ్వరరావు, చిట్టే వెంకట్, పెన్షనర్ల సంఘ నాయకులు రాజేశ్వరరావు, గుమ్మడి సీతారామయ్య చౌదరి, పి.వి.సత్యనారాయణ, పి.కోటేశ్వరరావు, సామ్రాజ్యం పాల్గొన్నారు.

అందరికీ మహాశివుని ఆశీస్సులు ఉండాలి

మాజీ ఎంపీపీ వెనిగళ్ల కృష్ణప్రసాద్



వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీపీ కృష్ణప్రసాద్

తెనాలిటౌన్: మహాశివరాత్రి పర్వదినాన పరమ శివుని ఆశీస్సులు అందరిపై మెండుగా ఉండాలని దుగ్గిరాల మాజీ ఎంపీపీ వెనిగళ్ల కృష్ణప్రసాద్ ఆకాంక్షించారు. రూరల్ మండలం ఖాజీపేట గ్రామంలో వేంచేసియున్న శ్రీకాశీ విశాలాక్షి సమేత శ్రీ విశ్వేశ్వరస్వామి దేవాలయంలో మహాశివరాత్రి వేడుకలు నిర్వహించారు. గురువారం ఏర్పాటు చేసిన పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ముఖ్యఅతిథిగా వెనిగళ్ల కృష్ణప్రసాద్ పాల్గొని పేద వృద్ధులకు కొత్త వస్త్రాలు అందజేశారు. విశ్రాంత ఉద్యోగులను సత్కరించారు. దేవాలయాభివృద్ధికి ధర్మకర్త రాచర్ల సాంబయ్య చేస్తున్న కృషి మరువలేనిదని కొనియాడారు. వసుదైక కుటుంబం ఖాజీపేట వారిచే నిర్వహించిన కోలాట ప్రదర్శన, జెడ్పీహెచ్ స్కూల్ విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం రేమిణిశెట్టి దుర్గాప్రసాద్ సహకారంతో అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం గ్రామంలో ఉత్సవ మూర్తుల ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకుడు కొండకావూరి నాగలింగశర్మ, రాచర్ల వెంకటసత్యనారాయణ, శనగపల్లి వెంకటేశ్వరరావు, తాళ్ల సీతారామిరెడ్డి, పొత్తూరి నాగేశ్వరరావు, రెడ్డి శివరామకృష్ణ, అంకిరెడ్డి సీతారామయ్య, పోతాబత్తుని మోహనరావు, కాలిశెట్టి గాయత్రీదేవి, పసుపులేటి వెంకట్రావు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఫౌండేషన్ ప్రతినిధులు

గుంటూరు రూరల్: మండలంలోని అడవితక్కెళ్లపాడులో గల అంబేడ్కర్ రెసిడెన్షియల్ బాలుర వసతి గృహంలో హెల్ప్ ఫౌండేషన్(సత్తెనపల్లి) ఆధ్వర్యంలో ఇంటర్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ నిర్వహించారు. కార్యక్రమాన్ని మోన్‌టెక్స్ పెన్స్ కంపెనీ ఆంధ్రప్రదేశ్ సేల్స్ మేనేజర్ యూకే రాజు, సేల్స్ ఎగ్జిక్యూటివ్ విజయ్‌భాస్కర్ సహకారంతో నిర్వహించారు. ఈ సందర్భంగా కుగ్లర్ మెమోరియల్ ఫిజియోథెరపీ కాలేజీ (గుంటూరు) కస్పాండెంట్ కర్ర హనోక్ బెంజిమెన్ మాట్లాడుతూ విజయాలను సాధించిన ప్రతి ఒక్కరు సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం వల్లే సాధ్యమైందని తెలిపారు. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ మంచి మార్కులు సాధించాలని చెప్పారు. క్రమశిక్షణ, మంచి ఆలోచన విధానంతో ఇంటర్మీడియట్ దశను దాటిన వారే జీవితంలో మంచి భవిష్యత్తును అందుకోగలరని సూచించారు. స్కాలర్స్ ఆర్ ఆర్ బీ కోచింగ్ డైరెక్టర్ టి. ఇమ్మానుయేల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని, వ్యక్తిని సమర్థ ప్రగతిశీల వనరుగా తీర్చిదిద్దేది కేవలం చదువు మాత్రమేనని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కొండారెడ్డి, ఐఐటీ నీట్ అకాడమీ డైరెక్టర్ ఆనంద్‌బాబు, హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కంచర్ల బుల్లిబాబు, శ్రీలక్ష్మి, ప్రేమ్‌కుమార్, ఉపాధ్యాయులు నాగభూషణం విశ్వేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

శంభో శివ శంభో

- మహాశివునికి అర్ధరాత్రి లింగోద్భవ కాలంలో అన్నాభిషేకం
- నవ దంపతుల గ్రామోత్సవం



దండేశ్వరాలయంలో అన్నాభిషేకం

ప్రత్తిపాడు: స్థానిక శ్రీగంగా పార్వతీసమేత దండేశ్వరాలయంలో హరోంహర హరహర మహాదేవ అంటూ శివనామస్మరణ మిన్నంటింది. మహా శివరాత్రి పర్వదినాన ఆది దంపతులు అగ్ని సాక్షిగా ఒక్కటయ్యారు. అశేష భక్త జన సందోహం నడుమ పార్వతీపరమేశ్వరుల పరిణయ వేడుక వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ బుధవారం రాత్రి వైభవోపేతంగా జరిగింది. గురువారం ఉదయం నూతన వధూవరులు గ్రామోత్సవంగా గ్రామంలోకి తరలివచ్చారు. మేళతాళాలు, పుష్పాలతో సుందరంగా అలంకరించిన ప్రత్యేక వాహనంపై పురవీధుల్లోనికి వచ్చిన ఉత్సమూర్తులకు మహిళలు వారులు పోసి హారతులిచ్చారు. అర్చకులు పరమేశ్వరశర్మ భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

లింగోద్భవ కాలంలో అన్నాభిషేకం

బుధవారం అర్ధరాత్రి పన్నెండు గంటల సమయంలో లింగోద్భవకాలంలో కైలాసనాథునికి అంగరంగవైభవంగా అన్నాభిషేకం జరిగింది. ఈ ఘట్టాన్ని తిలకించేందుకు వందల సంఖ్యలో ప్రజలు శివాలయానికి వచ్చారు.